# ప్రాచీన సంప్రదాయములు అభ్యున్నతికి సోపానములు

ప్రేమస్వరూపులారా! కేరళ ప్రజలకు ఇది చాలా ఆనందకరమైన పర్వదినం. ఈనాడు కేరళలో రైతులు పంటను కోసి ఇళ్ళకు తెచ్చుకొని ఆనందంగా పండుగ జరుపుకుంటారు. ప్రజలకు ఆహారమునందించి దేశానికి శాంతి, సౌభాగ్యములను చేకూర్చునటువంటివారు రైతులు. తెల్లవారి లేచినది మొదలు రాత్రి పరుండునంతవరకు పొలములందు కష్టించి పనిచేస్తూ దేశానికెంతో ఉపకారం చేస్తున్నారు. ఇట్టి ఆనందకరమైన సేవాభాగ్యానికి నోచుకోవడం నిజంగా వారి అదృష్టమనే చెప్పవచ్చు. రైతులు ఆనందముగా ఉన్నప్పుడే సర్వజనులూ ఆనందాన్ని, శాంతిని అందుకోగలరు. ప్రాచీనకాలమునుండి భారతదేశము అనేక విధములైన శ్రమలకోర్చి, అన్ని దేశములకూ ఆధ్యాత్మిక సంపత్తినందించి సుఖశాంతులను చేకూర్చుతూ వచ్చింది. నాటినుండి నేటి వరకు 'సమస్త లోకాః సుఖినో భవంతు' అన్నదే భారతీయుల ప్రధాన లక్ష్యము.

'సర్వం ఖల్విదం బ్రహ్మ,' ఈ జగత్తంతయు బ్రహ్మమయమే! కనుక మానవ జీవితం ధర్మమయం కావాలి. అప్పుడే జన్మ సార్థకమౌతుంది. 'కర్మానుబంధీని మనుష్యలోకే,' మానవుడు కర్మచేత కట్టబడినటువంటివాడు. తెల్లవారి లేచినది మొదలు కాలమును వ్యర్థం చేయకుండా సమాజ శ్రేయస్సుకోసం పాటుపడడమే మానవుని ప్రధాన కర్తవ్యం. సమాజక్షేమమే తన క్షేమమని విశ్వసించాలి. నేను చూశాను – కేరళ ప్రజలు ఎంతో కష్టపడి పనిచేస్తారు. సమాజసేవలో పాల్గొంటారు. శాంతి, భద్రతలకోసం పాటుపడతారు. విద్యాసంస్థలకు ఆలవాలమైనటువంటిది కేరళ. వేదశాస్త్రేతిహాస పురాణములకు ప్రమాణము చూపినటువంటిది కేరళ. ఇంతటి పవిత్రమైన భూమియందు ప్రజలీనాడు శాంతి, ఆనందాలను అందుకోలేకపోతున్నారు. అయితే, దానికి తగిన కాలము వస్తుంది. ప్రతి దానికి కాలమే ప్రధానము, కాలమే ప్రమాణము. కనుక, మనం కాలమును సార్థకం

sri sathyasai vahanamrutam

గావించుకోవాలి. దైవము నిర్దేశించిన కర్తవ్య కర్మలను సక్రమముగా ఆచరించాలి.

**'కష్టే ఫలీ'**

మనం బహిర్ముఖంగా ఆచరించే సమస్త కర్మలూ మన అంతర్భావముయొక్క ప్రతిబింబములే! బహిర్ముఖంగాను, అంతర్ముఖంగాను ఆనందాన్ని అనుభవించాలంటే మనం సత్కర్మలనాచరించాలి. ఏ మానవుడైనా కర్మలను ఆచరించకుండా ఊరకే కూర్చోవడానికి వీలుకాదు.

**కర్మమునందె పుట్టు జంతువు**
**కర్మమునందె వృద్ధి పొందు కర్మముననె చనున్**
**కర్మయె నరునకు దైవము**
**కర్మయె సుఖదుఃఖములకు కారణమిలలో**

కర్మలనాచరించే నిమిత్తమే కాయము ఏర్పడినది. కాల, కర్మ, కారణ, కర్తవ్యములతో ముడిపడి ఉన్నదే మానవ జీవితము. కాని, కలిప్రభావముచేత ఈనాటి మానవుడు నడుమువంచి పని చేయడంలేదు. విద్యావంతులలోనూ, విద్యాహీనులలోనూ సోమరితనము పెరిగిపోయింది. ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలి. పుణ్యకర్మలచేత జీవితమును ధన్యము గావించుకోవాలి. కర్మలను ఆచరించకుండా సోమరితనాన్ని పెంచుకోవడం నిజంగా దురదృష్టమనే చెప్పవచ్చు. ఈనాటి విద్యార్థులు కష్టపడకుండా పరీక్షల్లో పాస్ కావాలని, కష్టపడకుండా ఉద్యోగం సంపాదించాలని ఆశిస్తున్నారు. ఉద్యోగంలో చేరిన తరువాత శ్రమపడకుండా జీతాలు పెంచాలని కోరుతున్నారు. ఇది మానవుడు కోరవలసింది కాదు. 'కష్టే ఫలీ.' కష్టపడి పనిచేసినప్పుడే సరియైన ఫలితము చిక్కుతుంది. కాని, కష్టపడి పనిచేయడానికి, పవిత్రమైన కర్మలను ఆచరించడానికి ఈనాడు ఎవ్వరూ సిద్ధంగా లేరు. ఆఫీసులకు వెళుతున్నారు, అటెండెన్స్ ఇచ్చి వస్తున్నారు. ఏమి చేస్తున్నారు ఆఫీసుల్లో? తమ కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వర్తిస్తున్నారా? ఈవిషయమై ఎవరికి వారు ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఆత్మపరిశీలన ప్రతి మానవునికి అత్యవసరం.

srisathyasaivachanamrutam

**కష్టపడడానికి ఇష్టపడాలి**

ప్రేమస్వరూపులారా! ఈనాడు లోకము అనేక అవస్థలకు గురి అవుతోంది. ఆహారపానీయాలకు కొరత ఏర్పడింది. దీనికి కారణమేమిటి? మానవుడు సక్రమమైన కర్మలను ఆచరించడం లేదు. ప్రతి వ్యక్తీ తన కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వర్తించినప్పుడు ఆహారపానీయాలకు ఏమాత్రం కొరత ఉండదు. కష్టపడకుండా సుఖం లభించాలని ఆశించడం అవివేకం. 'న సుఖాత్ లభ్యతే సుఖం.' సుఖము నుండి మనకు సుఖము చిక్కదు. కష్టమునుండియే సుఖము చిక్కుతుంది. కనుక, మనం కష్టపడి పనిచేయాలి. అప్పుడే సరియైన ఫలితాన్ని అందుకోగలము. మనం ఏ కర్మలను ఆచరించినప్పటికీ వాటి 'రిఫ్లెక్షన్, రియాక్షన్, రీసౌండ్'లు మనకే తిరిగి వస్తాయి. మనం చేసే కర్మలను అనుసరించియే ఫలితం లభిస్తుంది. మన 'యాక్షన్'కు తగిన 'రియాక్షనే' వస్తుంది. మనం చేసే 'సౌండు'కు తగిన 'రీసౌండే' వస్తుంది. అనగా, మనం పవిత్రమైన పలుకులు పలికినప్పుడే ఇతరులనుండి మనం పవిత్రమైన పలుకులను వినగలము.

ఈనాడు మనము సుఖమనగా ఏమిటో, దుఃఖమనగా ఏమిటో చక్కగా విచారణ చేయాలి. కడుపునిండా తిండి తినడం, ఏమాత్రం కష్ట పడకుండా హాయిగా నిద్రించడం... సుఖమంటే ఇదేననుకుంటున్నారు. ఇది సుఖమే కాదు. కష్టపడి పనిచేయాలి. సమాజ సంక్షేమానికి పాటుపడాలి. బీదలకు తగిన సహాయం చేయాలి. అప్పుడే మనకు శాంతి, సుఖములు లభిస్తాయి. ప్రతి ఒక్కరూ శాంతి కావాలని ఆశిస్తున్నారు. ఎక్కడుంది శాంతి? మీలోనే ఉంది. బయట Pieces తప్ప Peace లేదు. మీరే శాంతిస్వరూపులు. మీరే సత్యస్వరూపులు. మీరే ప్రేమస్వరూపులు. మీరే దైవస్వరూపులు. అన్నీ మీయందే ఉంటున్నవి. మీయందే ఉన్న శాంతికోసం మీరు బయటి ప్రపంచంలో వెతకడం ఎంత వెఱ్ఱితనము! శాంతి బయట లేనే లేదు, మీయందే ఉంటుందాది. మీలో ఉన్న శాంతిని మీరు అనుభవించాలంటే దానికి తగిన కృషి చేయాలి. మీ దృష్టిని అంతర్ముఖం గావించుకోవాలి.

sri sathyasai vachanamrutam

**తరువ తరువ బుట్టు తరువున ననలంబు**
**తరువ తరువ బుట్టు దధిని ఘృతము**
**తరువ తరువ బుట్టు తనువున తత్త్వంబు**
**ఉన్నమాట తెలుపుచున్న మాట**

కష్టపడి పనిచేసినప్పుడే మనలో జ్ఞానాగ్ని ఆవిర్భవిస్తుంది. కాని, కష్టపడి పనిచేయడానికి ఎవరికీ ఇష్టముండదు. అందరూ సుఖపడాలనే ఆశిస్తారు. కాని, సుఖము ఎక్కడినుండి వస్తుంది? కష్టము ఫలించినప్పుడే సుఖము లభిస్తుంది. లోకములో ఎక్కడ చూసినా సుఖముంది. కాని, దానిని అనుభవించడానికి తగిన అర్హతను మీరు సంపాదించుకోవాలి. ఇంతకుముందు ప్రసంగించిన జడ్జి చెప్పాడు, తానెన్నో శ్రమలకోర్చి, ఎన్ని దినములు తిరిగినప్పటికీ స్వామి పలుకరించక పోయేసరికి ఎంతో బాధపడ్డాడు. ఆ కష్టానికి తగినటువంటి ఛాన్సు ఈనాడతనికి చిక్కింది. కాని, కష్టపడడానికి మీరు ఇష్టపడడం లేదు. ఇష్టపడాలి. అప్పుడే తగిన ఫలితం లభిస్తుంది.

**'తస్మై నమః కర్మణే'**

ఉపనిషత్కాలములో మానవులు ఏదైనా కర్మను ఆచరించడానికి పూర్వం 'తస్మై నమః కర్మణే' అని కర్మకు నమస్కరించేవారు. తాము ఆచరించే కర్మ సత్ఫలితమును అందించాలనే ఆకాంక్షతో మొట్టమొదట కర్మకు నమస్కరించి దానిని ప్రారంభించే వారు. భారతదేశములో ఇప్పటికీ కొందరు ఈ సంప్రదాయాన్ని పాటిస్తున్నారు. ఒక క్రికెట్ ఆటగాడు మొట్టమొదట బ్యాట్‌కి, బంతికి నమస్కరించిన తరువాతనే ఆటను ప్రారంభిస్తాడు. ఒక నర్తకి కాళ్ళకు గజ్జెలు కట్టుకునేముందు వాటికి నమస్కారం చేస్తుంది. నిరక్షరాస్యులైన డ్రైవర్లు కూడా స్టీరింగుకు నమస్కరించిన తరువాతనే డ్రైవింగు ప్రారంభిస్తారు. ఇట్టి ప్రాచీన సంప్రదాయమును, సంస్కృతిని ఆధునిక విద్యావంతులు విస్మరిస్తున్నారు. అందుచేతనే, ఈనాడు ఎక్కడ చూసినా యాక్సిడెంట్లే! ఎక్కడ చూసినా భయభ్రాంతులే! మనం ఏ పనైనా ప్రారంభించే ముందు కృతజ్ఞతతో, గౌరవభావముతో మొట్టమొదట ఆ పనికి నమస్కరించాలి. సంగీత విద్వాంసులు వినాయక ప్రార్థనతో తమ కచేరీని ప్రారంభిస్తారు. వినాయకుడనగా నాయకుడు లేనటువంటివాడు. 'వి-నాయకుడు', అందరికీ తానే

srisathyasaivachanamrutam

నాయకుడు. కనుక, ఎలాంటి విఘ్నములూ కలుగకుండా ఉండే నిమిత్తం వినాయకుణ్ణి మొట్టమొదట ప్రార్థించాలి. ప్రాచీన కాలమునుండి మన భారతీయులు ఇలాంటి సంప్రదాయములను చక్కగా పాటిస్తూ వచ్చారు.

**మన ప్రాచీన సంప్రదాయములు పవిత్రమైన అంతరార్థములతో కూడినవి**

మనం ఏవైనా శుభకార్యములను జరుపుకునే సమయంలో ఇంటికి పచ్చని మామిడాకులతో తోరణాలు కడతాము; అరిటాకులతో అలంకరణ చేస్తాము. వివాహసందర్భంలో పచ్చని ఆకులతో పందిరి వేస్తాము. దేనికోసం? డబ్బిచ్చి ఆకర్షణీయమైన షామియానాలను ఏర్పాటు చేసుకోకూడదా? అది మన ప్రాచీన సంప్రదాయానికి విరుద్ధమైనది. పచ్చని ఆకులతో తోరణాలు కట్టుకోవడంలోను, పందిరి వేసుకోవడంలోను ఎంతో గొప్ప అంతరార్థమున్నది. వివాహము జరిగేచోట జనులు అధికసంఖ్యలో ప్రోగవుతారు. వాళ్ళ శ్వాసప్రక్రియద్వారా ఎక్కువమొత్తంలో విడుదలయ్యే బొగ్గుపులుసు వాయువును పచ్చని ఆకులు పీల్చివేసి వాతావరణ కాలుష్యాన్ని నివారిస్తాయి. అంతేగాక, మనకు ప్రాణాధారమైన ఆక్సిజన్‌ను అందించి మన ఆరోగ్యాన్ని పరిరక్షిస్తాయి, ఆనందాన్ని చేకూర్చుతాయి. మన ప్రాచీన సంప్రదాయములలో ప్రతి ఒక్కటీ పవిత్రమైన అంతరార్థముతో కూడి ఉన్నది. అలాంటి సంప్రదాయములను ఈనాడు విస్మరిస్తున్నారు. ఎక్కడైనా పెళ్ళిళ్ళు జరుగుతున్నాయంటే అక్కడ పెద్దపెద్ద షామియానాలు వేసుకుంటారు. ఫ్యాషన్లపై మోజుతో ప్లాస్టిక్‌తోరణాలను తెచ్చి కట్టేస్తుంటారు. అవి బొగ్గుపులుసు వాయువును పీల్చుకోగలవా? ప్రాణవాయువును అందించగలవా? అవి కంటికి ఇంపుగా కనిపిస్తాయిగాని, వాటివలన మనకు కలిగే ఉపయోగమేమీ లేదు. ప్రజలు బాహ్యమైన అలంకరణను మాత్రమే దృష్టిలో పెట్టుకుంటున్నారుగాని, ఆరోగ్యాన్ని గురించి ఆలోచించడం లేదు.

పల్లెప్రజలు నీళ్లలో Cowdung (ఆవుపేడ)ను కలిపి తమ ఇళ్ళ ముందు చల్లి, చక్కగా ముగ్గులతో అలంకరిస్తారు. ఇది చాలా మంగళకరమైనది. Cow dung యొక్క వాసనచేత మనలో ఉన్న దుష్టవ్యాధులు నయమైపోతాయి. ఈ సత్యాన్ని ఈనాడు

విదేశీయులు గుర్తించారుగాని, భారతీయులు గుర్తించడానికి ప్రయత్నించడం లేదు. పూర్వకాలంలో ఎవరికైనా పుండ్లు పుడితే, ఆ పుండ్లకు Cowdung వేసి కట్టు కట్టేవారు. కాని, ఆధునికయుగమువారంతా అలా చేస్తే 'సెప్టిక్' అవుతుందంటారు. కాదు, కాదు. పుండుమీద Cow dung వేసి కట్టుకడితే మూడు దినాలలో నయమైపోతుంది. Cow dung లో అంత పవిత్రమైన శక్తి ఉన్నది. గోమూత్రము కూడా చాలా పవిత్రమైనది. ఏదైనా 'అమ్మ' వచ్చిందంటే, గోమూత్రాన్ని నీటిలో కలిపి అందరికీ చల్లుతుంటారు. ఇది ఎంతో క్షేమాన్ని కల్గజేస్తుంది. ఇలాంటి పవిత్రమైన సంప్రదాయాలను మన భారతీయులు ఇంకా అభివృద్ధిపరచుకోవాలి. ఎవరేమైనా అనుకోనీయండి, మన ఆత్మతృప్తిగా మనం నడుచుకోవాలి. మన సంప్రదాయాలను మనం అనుసరించాలి. మన సంప్రదాయాలను మనం పోషించుకొని, ధనధాన్యములను అభివృద్ధి పరచుకొని, వాటిని ఇతరులతో పంచుకొని ఆనందాన్ని అనుభవించడమే 'విశు' పండుగయొక్క పరమార్థం.

**'విశు' యొక్క విశిష్టతను గుర్తించి వర్తించండి**

కేరళలో మన ప్రాచీనసంప్రదాయాలు నేటికీ సుస్థిరంగా నిలిచియున్నాయి. కేరళ ప్రజలు తమ ఇంట్లో ఏ చిన్న శుభకార్యము జరిగినప్పటికీ పళ్ళెరములో బియ్యం పోసి, దీపము పెట్టి, దాని చుట్టూ చక్కని అలంకరణ చేస్తారు. ఈవిధమైన సంప్రదాయము గృహానికి చాలా మంగళకరమైనది. అయితే, మనం కేవలం అలంకరణకు మాత్రమే ప్రాధాన్యమివ్వరాదు; ఆచరణకు ప్రాధాన్య మివ్వాలి. 'విశు' యొక్క విశిష్టతను మనం చక్కగా అర్థం చేసుకోవాలి. ఈ పండుగలో అంతర్లీనమై ఉన్న సంప్రదాయమును గుర్తించి వర్తించాలి. ఎదుటి వ్యక్తికి గౌరవాన్ని అందించి, గౌరవాన్ని అందుకోవాలి. ఏనాడైతే అందరి గృహాలూ ధనధాన్యాలతో తులతూగుతూ ఉంటాయో ఆనాడే నిజమైన 'విశు' పండుగ. 'విశు' వచ్చిందంటే 'విష్ యు ఎ హ్యాపీ న్యూ ఇయర్' అంటూ ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకుంటే సరిపోదు. నిజంగా ఒకరి క్షేమంకోసం ఒకరు పాటుపడాలి. మీ ఆనందాన్ని ఇతరులతో పంచుకోవాలి. ఆనందాన్ని అందించడం, ఆనందాన్ని అందుకోవడం... ఇదే 'విశు'యొక్క తత్త్వము. ఆనందాన్ని మనం అందించకుండా ఇతరులనుండి అందుకోవడానికి వీలుకాదు. Give

sri sathyasai vachanamrutam

and take. అందించాలి, అందుకోవాలి. ఇది మన ప్రాచీన సంప్రదాయము. తెల్లవారుజామున లేచి అభ్యంగస్నానమాచరించి, నూతన వస్త్రములను ధరించడంతోపాటు మన అంతరంగమునుకూడా పరిశుభ్ర పరచుకోవాలి. దేహశుద్ధి, మనశ్శుద్ధి రెండింటినీ చేకూర్చునదే 'విశు'. పెద్దలకు నమస్కరించి వారిని సంతోషపెట్టాలి. ఇంత పవిత్రమైన అంతరార్థముతో కూడిన 'విశు'ను ఏదో భౌతికమైనరీతిగా జరుపుకోవడం పొరపాటు. కేరళలో అరటి తోటలు, కొబ్బరితోటలు విరివిగా కనిపిస్తాయి. పర్వదినాలలో కేరళ ప్రజలు అరటిపండ్లతో ఎన్నోరకములైన పాయసాలు చేసి ఇతరులకు అందించి తమ ఆనందాన్ని వారితో పంచుకుంటారు. 'నేంద్ర ఫలం' అని పిలువబడే ఒక ప్రత్యేకమైన రకం అరటిపండ్లను అందరికీ పంచిపెడతారు. కొబ్బరి కాయలలో పవిత్రమైన 'రేడియేషన్' ఇమిడియున్నది. ఇది జ్ఞానశక్తికి సంబంధించినది.

**భౌతిక సుఖము సుఖము కాదు**

మనం గాయత్రీమంత్రోచ్చారణను 'ఓం భూర్భువస్సువః' అని ప్రారంభిస్తాము. 'ఓం' అనేది ప్రణవ నాదము. 'భూః' అనగా భూలోకము. ఇది మెటీరియల్స్‌తో నిండినది. కాబట్టి, 'భూః' అనగా 'మెటీరియలైజేషన్.' 'భువః' అనేది మానసిక సంబంధమైన తత్త్వము. దీనిని 'వైబ్రేషన్' అన్నారు. ఇంక, 'సువః' అనేది జ్ఞానసంబంధమైనది. దీనినే 'రేడియేషన్' అన్నారు. 'మెటీరియలైజేషన్', 'వైబ్రేషన్', 'రేడియేషన్' – ఈ మూడింటియొక్క సమ్మిళితమైన స్వరూపమే 'భూర్భువస్సువః'. ఇందులో ఎంతో గొప్ప ఫలితమున్నది. కాని, ఈనాటి మానవుడు భౌతికమైన ఫలితాలను ఆశిస్తున్నాడు. ఇది చాలా పొరపాటు. భౌతికమనేది తాత్కాలికము. భౌతిక సుఖము సుఖము కాదు. ఇదే శంకరులవారు చెప్పారు: 'మాకురు ధన జన యౌవనగర్వం హరతి నిమేషాత్కాల స్సర్వం' కాబట్టి, ఈ తాత్కాలికమైన సుఖముల కొరకు మనం ప్రాకులాడకూడదు. సత్యనిత్యమైన సుఖాన్ని మానవుడు ఆశించాలని శంకరులవారు లోకంలో చాటుతూ వచ్చారు. పుట్టడం, చావడం... ఇదేనా జీవితపరమావధి? కాదు, కాదు. ఒకసారి పుట్టిన తరువాత మళ్ళీ పుట్టకుండా చూసుకోవాలి.

sri sathyasai vahini amrutam

పునరపి జననం పునరపి మరణం పునరపి జననీ జఠరే శయనం
ఇహసంసారే బహు దుస్తారే కృపయా పారే పాహి మురారే

**లోకాన్ని నమ్మవద్దు, లోకేశుని స్మరించండి**

ఒక పర్యాయం శంకరులవారు తన శిష్యులను వెంటపెట్టుకొని గంగానదికి వెళుతూ ఉండగా మార్గమధ్యంలో ఒక వ్యక్తి ఒక చెట్టుక్రింద కూర్చుని 'డుకృఞ్ కరణే... డుకృఞ్ కరణే...' అంటూ పాణినీ వ్యాకరణసూత్రాన్ని వల్లెవేయడం గమనించారు. అతనివద్దకు వెళ్ళి, 'నాయనా! నీకు అంత్యకాలమాసన్నమైనప్పుడు 'డుకృఞ్ కరణే' నిన్ను కాపాడదు. కాబట్టి, గోవిందుని భజించు' అని బోధించారు.

భజ గోవిందం భజ గోవిందం గోవిందం భజ మూఢమతే
సంప్రాప్తే సన్నిహితే కాలే నహి నహి రక్షతి డుకృఞ్ కరణే

పాండిత్యముకోసం, పేరుప్రతిష్ఠలకోసం మీరు ప్రాకులాడకూడదు. పేరుప్రతిష్ఠలు నేడు వస్తాయి, రేపు పోతాయి. చెఱువులో నీరుంటే కప్పలెన్నో అందులోకి ప్రవేశిస్తాయి. నీరెండిపోతే ఒక్క కప్పకూడా అక్కడ కనిపించదు. అదేవిధంగా, మీవద్ద ధనము దండిగా ఉన్నప్పుడు అనేకమంది మీ చుట్టూ చేరతారు. మీ జేబులు ఖాళీ అయితే ఎవ్వరూ మీ ముఖం కూడా చూడరు. కాబట్టి, లోకాన్ని నమ్మవద్దు. లోకేశుని స్మరించండి. 'భజ గోవిందం.' ఈవిధమైన బోధనలచేత ఆదిశంకరులవారు భారతదేశ ఆధ్యాత్మికసంపత్తిని అభివృద్ధి గావించుకుంటూ వచ్చారు. కాని, ఈనాడు శంకరులవారి బోధనలను ఎవరనుసరిస్తున్నారు? ఆయన సందేశాన్ని ఆచరణలో పెట్టడంద్వారా ఆయనకు మీరు కృతజ్ఞత చూపాలి. ఒక్కొక్క దేశానికి, ఒక్కొక్క రాష్ట్రానికి కొన్ని సంప్రదాయాలుంటాయి. వాటిని మనం ఏనాటికీ మరువకూడదు. కాని, ఈనాడు సంప్రదాయాలన్నీ కేవలం ఫ్యాషన్లుగా మారిపోయినాయి. ఇది సరియైన పద్ధతి కాదు. ప్రాచీన సంప్రదాయాలన్నీ మన హృదయంలో హత్తుకొనిపోవాలి. వాటి విశిష్టతను చిన్నతనమునుండియే పిల్లలకు బోధించి, వారిని సరియైన మార్గములో ప్రవేశపెట్టాలి. వారికి తగినటువంటి శిక్షణ ఇవ్వాలి. వారిచేత మన ప్రాచీన సంప్రదాయములను 'ప్రాక్టీసు' చేయించాలి.

sri sathyasai vahamrutam

శ్రేయో హి జ్ఞానమభ్యాసాత్ జ్ఞానాద్ధ్యానం విశిష్యతే
ధ్యానాత్కర్మ ఫలత్యాగ స్త్యాగా చ్ఛాన్తి రనన్తరమ్

మొట్టమొదట అభ్యాసం చేయించాలి. పిల్లలచేత సరియైనరీతిగా అభ్యాసం చేయించకపోతే వాళ్ళు పెడమార్గం పడతారు. పిల్లలను సన్మార్గంలో పెట్టవలసిన బాధ్యత తల్లిదండ్రులపై ఉన్నది. తరువాత గురువులు పిల్లలయందు సద్గుణాలను పెంపొందించాలి. అప్పుడే దేశము అభివృద్ధికి వచ్చి సుక్షేమాన్ని అనుభవించ గల్గుతుంది. లేకపోతే 'క్షేమం' పోయి 'క్షామం' ప్రారంభమౌతుంది. కనుక, లోకక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని మీ ప్రవర్తనను చక్కదిద్దుకోండి. మీరు, మీ ఇంటివారు, మీ బంధుమిత్రులు మాత్రమే కాదు, అందరూ సుఖంగా, క్షేమంగా ఉండాలని ఆశించండి. మీ తోటివ్యక్తి నవ్వుతూ ఆనందంగా ఉన్నప్పుడే మీరు కూడా నవ్వుతూ ఆనందంగా ఉండగలరు.

**'అతిథిదేవో భవ'**

విద్యార్థులారా! మన ప్రాచీన సంప్రదాయముల ఔన్నత్యాన్ని మీరు గుర్తించి వర్తించాలి. పెద్దలెవరైనా మీ ఇంటికి వస్తే, 'దయచేయండి, కూర్చొండి,' అంటూ సాదరంగా వారిని ఆహ్వా నించాలి. 'నాన్నగారు ఇంట్లో లేరు. తరువాత రండి,' అంటూ దురుసుగా మాట్లాడకూడదు. నాన్నగారు ఇంట్లో ఉన్నా లేకపోయినా ఇంటికి వచ్చినవారికి కనీసం మంచినీళ్ళైనా, మజ్జిగైనా ఇవ్వాలి. వారితో గౌరవంగా మాట్లాడాలి. కాని, ఈనాటి పిల్లలకు ఇలాంటి మంచి అలవాట్లు లేనే లేవు. ఎవరైనా ఫోను చేసి, 'మీ నాన్నగారు ఉన్నారా నాయనా?' అని అడిగితే, ఆయన ఇంట్లోనే ఉన్నప్పటికీ, 'లేరు,' అని చెప్పి ఫోను పెట్టేస్తారు. ఫోనులోకూడా పెద్దలతో గౌరవంగా మాట్లాడాలి. పెద్దలను మీరు గౌరవించినప్పుడే మిమ్మల్ని ఇతరులు గౌరవిస్తారు. గౌరవించడమంటే ఏమిటి? చెయ్యెత్తి 'హలో' అనడం కాదు. వినయవిధేయతలతో, మృదువుగా 'నమస్కారమండీ' అనాలి. 'న' అనగా లేకుండా, 'మ' అనగా మమకారము. కనుక, మమకారానికి ఆస్కారము ఇవ్వనటు వంటిది నమస్కారము. ఇట్టి పవిత్రమైన అంతరార్థాలను గుర్తించడానికి మీరు ప్రయత్నించాలి. 'మాతృదేవో భవ', 'పితృదేవో భవ', 'ఆచార్యదేవో భవ', 'అతిథిదేవో భవ', అని వేదము

sri sathyasai vachanamrutam

ఘోషిస్తోంది. మీ తల్లిదండ్రులను, మీ గురువులను మరియు అతిథులను మీరు గౌరవించినప్పుడే మిమ్మల్ని ప్రజలు గౌరవిస్తారు. పెద్దలను మీరు గౌరవించకపోతే మీకెవ్వరూ గౌరవాన్నివ్వరు. మీరు గౌరవాన్నిచ్చి పుచ్చుకోవాలి. మన ప్రాచీనులు ఇలాంటి పవిత్రమైన సంప్రదాయాన్ని పాటించడంవల్లనే లోకమంతా ఇంతకాలం సుస్థిరంగా నిలువగల్గింది. 'భారతీయులు వినయసంపన్నులు, భగవద్విశ్వాసం గలవారు, పవిత్రమైన సంప్రదాయములు గలవారు. భారతీయసంస్కృతి మహోత్కృష్టమైనది,' అని గుర్తించి ప్రపంచమంతా భారతదేశాన్ని గౌరవిస్తున్నది. కాని, ఈనాడు భారతదేశమంటే ఏమిటో భారతీయులే అర్థం చేసుకోలేకపోతున్నారు. 'ఎన్న భారతే తన్న భారత,' భారతదేశములో లేనిది ప్రపంచంలో ఇంకెక్కడా లేదు. 'భారత' అంటే ఏమిటి? భావ, రాగ, తాళములతో భగవంతుని భజించేవారే భారతీయులు. భావముండీ రాగము లేకపోతే ప్రయోజనం లేదు. రాగ, తాళములుండీ భావము లేకపోతే ప్రయోజనం లేదు. ఈ మూడూ ఏకం కావాలి. పవిత్రమైన భారతీయ సంస్కృతిని మీరు గౌరవించాలి, అనుసరించాలి, తగినరీతిగా ప్రచారం చేయాలి. ఇదే నిజమైన విద్యావంతుల లక్షణం.

(తేదీ 15.04.2003, 'విశు' సందేశం, బృందావనం)

sri sathyasai vahinimrutam